క్లుప్తంగా

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రితో గౌహతి సుబ్బారెడ్డి

పూతలపట్టు: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం పూతలపట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకురాలు గౌహతి సుబ్బారెడ్డి మండల అభివృద్ధికి విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పి.తేజేశ్వర్‌రెడ్డి, పి.గుణేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న హుండీ లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును ఈ నెల 28న లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. 28న శుక్రవారం ఉదయం ఆలయ ఆస్థాన మండపంలో హుండీ కానుకలను లెక్కింపు కార్యక్రమానికి ఆలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అనారోగ్యంతో శనివారం మృతి చెందిన జెడ్పీ కార్యాలయ సీనియర్ సహాయకులు పురుషోత్తంరెడ్డి(47)కి సీఈఓ ప్రభాకర్‌రెడ్డి నివాళి అర్పించారు. స్థానిక మురకంబట్టులోని ఆయన నివాసం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. గతంలో పురుషోత్తం రెడ్డి మంత్రి పెద్దిరెడ్డికి పీఏగా ఉన్న విషయం గుర్తు చేశారు. పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు దహన క్రియలకు ఆర్థికసాయం అందించారు.

పార్టీలకతీతంగా పథకాలు



కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పూతలపట్టు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం మండలంలో అయ్యప్పగారిపల్లి పంచాయతీ అంద్రవారిపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, మాసిలామణి, షన్ముగం, మణి, బాబుయాదవ్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

చిత్తూరు కలెక్టరేట్: మూల్యాంకన కేంద్రంలో తగు వసతులు కల్పించి జాగ్రత్తలు పాటించాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు రెడ్డిశేఖర్ రెడ్డి అన్నారు. ఆర్జేడీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటకృష్ణారెడ్డిని వైఎస్సార్ జిల్లాలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మూల్యాంకన కేంద్రంలో పకడ్బందీగా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్యాన్‌లు, తాగునీరు, వైద్యులను అందుబాటులో ఉంచాలని కోరగా ఆర్జేడీ సానుకూలంగా స్పందించి డీఈవోకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గృహ మిత్ర మూడో బహుమతి



చిత్తూరు రూరల్: చిత్తూరు ట్రిప్లెక్స్ ఏజెన్సీ చెందిన వినియోగదారునికి హెచ్‌పీసీఎల్ గృహ మిత్ర పథకం కింద మూడవ బహుమతి లభించింది. చిత్తూరులో శనివారం ఆ ఏజెన్సీ సమావేశం నిర్వహించారు. డెప్యూటీ జనరల్ మేనేజర్ అశ్విన్‌కుమార్ అగర్వాల్, సీనియర్ సేల్స్ ఆఫీసర్ కిషోర్ చేతులమీదుగా వినియోగదారుడు సెంథిల్‌రాజ్‌కు బహుమతిని ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామమూర్తి, మేనేజర్ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఓంశక్తి పూజలు

పాలసముద్రం: మండలంలోని నిశింకాపురం గ్రామంలో వెలసిన ఓంశక్తి ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం గురుస్వామి అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి ఓంశక్తి భక్తులు పంబవాయిద్యాలతో కొత్త కుండల్లో పొంగళ్లు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి మూడుసార్లు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

'సంకర' సంపదకు ఊతం

- పాడి రైతుల సంరక్షణలో పెయ్యదూడల పెంపకం
- జెర్సీ కోడె దూడల ఉత్పత్తికి శ్రీకారం
- జిల్లాలో పాల ఉత్పత్తి పెంపునకు చర్యలు

సంకర జాతి పశు సంపదకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. జెర్సీ పెయ్య దూడల సంతతి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించింది. పాడి రైతుల సహకారం తీసుకుంటోంది. సంకర జాతిని అభివృద్ధి చేసి తద్వారా పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనిపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఇప్పటికే చిత్తూరు మండలంలోని పల్లెల్లో పెయ్య దూడల ప్రదర్శనలు ప్రారంభించింది. అదే సమయంలో జెర్సీ కోడె దూడల పరిరక్షణకు శ్రీకారం చుట్టింది.



చెర్లోపల్లెలో పెయ్యదూడల ప్రదర్శన (ఫైల్)



చిత్తూరు: జెర్సీ దూడల ప్రదర్శన (ఫైల్)

చిత్తూరు అగ్రికల్చర్: పాల ఉత్పత్తిని పెంచేందుకు సంకర జాతి పశు సంపదను అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేసింది. అందులో భాగంగా పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం చిత్తూరు డివిజన్ పరిధిలో సంకరజాతి జెర్సీ పెయ్య దూడల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. పశు సంతతి పరిశీలనా పథకం ఆధ్వర్యంలో పాడి రైతుల ద్వారా జెర్సీ పెయ్య దూడల పెంపకాన్ని విరివిగా చేపడుతున్నారు.

అధిక పాల దిగుబడినిచ్చే మేలుజాతి పశుసంతతిని అభివృద్ధి చేసేందుకు, సంకరజాతి జెర్సీ పెయ్య దూడల పెంపకం విరివిగా చేపట్టాలి. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పశు సంతతి పరిశీలనా పథకం ఆధ్వర్యంలో చిత్తూరు డివిజన్ పరిధిలో జెర్సీ పెయ్య దూడల అభివృద్ధిని చేపడుతున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నిధులతో నేషన ల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నుంచి అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద డివిజన్ పరిధిలోని 16 మండలాల్లో 15 వేల పెయ్యదూడలను నమోదు చేశారు.

కోడెదూడల ఉత్పత్తి

రైతుల నుంచి 150 సంకరజాతి జెర్సీ కోడె దూడలను కొనుగోలు చేసి నకిరేకల్ (గుంటూరు జిల్లా)లోని కోడెదూడల పెంపకం కేంద్రానికి తరలించారు. ఈ కోడె దూడల ద్వారా సేకరించిన సెమెన్‌తో జెర్సీ పేయ దూడల ఉత్పత్తికి చర్యలు చేపడతారు. సంకరజాతి పశువులు దూడలకు జన్మనిచ్చిన తరువాత పాల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ నమోదు ప్రక్రియను నెలకో రోజు (ఉదయం, సాయంత్రం) చొప్పున 10 నెలలపాటు చేపడతారు. వాటిలో అధిక పాలు ఇచ్చే 50 ఉత్తమ ఆవులను ఎంపిక చేశారు. అవి ఎదకు వచ్చిన సమయంలో అత్యుత్తమ కోడెల వీర్యంతో నామినేటెడ్ కృత్రిమధారణ చేస్తారు. కృత్రిమ గర్భధారణతో పుట్టిన కోడె దూడలను నిబంధనల మేరకు ఎంపికచేసి వాటిని భవిష్యత్తు అవసరాల నిమిత్తం కోడె దూడల పెంపకం కేంద్రానికి తరలిస్తారు.

అధిక పాల ఉత్పత్తి

పశుసంతతి పరిశీలన కేంద్రం ఆధ్వర్యంలో చిత్తూరు డివిజన్ పరిధిలో 15 వేల జెర్సీ పెయ్య దూడలను నమోదు చేశారు. ఈ సంకరజాతి జెర్సీ దూడలు ఇక్కడి వాతావరణాన్ని తట్టుకుని అధిక పాల ఉత్పత్తిని సాధించే దిశగా పశుసంతతి పరిశీలన కేంద్రం అధికారులు చర్యలు చేపడుతున్నారు. జెర్సీ ఆవులలో అధిక పాల ఉత్పత్తితోపాటు పాలలో వెన్నశాతం, మంచి సంతానోత్పత్తి వంటి జన్యు సంబంధిత లక్షణాలు అధికంగా ఉన్నాయి. ఈ జెర్సీ ఆవులను అభివృద్ధి పరచడం వల్ల భవిష్యత్తులో అధిక పాల ఉత్పత్తిని సాధించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది.

జెర్సీ ఆవుల అభివృద్ధే ధ్యేయం



అధిక పాల ఉత్పత్తిని సాధించాలంటే సంకర జాతికి చెందిన జెర్సీ ఆవులను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ దిశగా చర్యలు చేపడుతున్నాం. రైతుల సంరక్షణలోనే పెయ్యదూడల పెంపకం చేపట్టాం. వీటిని ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి ఎదుగదలను గుర్తించి మంచి ఫలితాన్ని సాధిస్తున్నాం. జెర్సీ ఆవులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామాల్లో పెయ్యదూడల ప్రదర్శన కూడా చేపడుతున్నాం.

– హనీఫ్, డీడీ, పశుసంతతి పరిశీలన కేంద్రం

నేడు శక్తి క్షేత్రంలో సంగీత కచేరి

తవణంపల్లె: మండలంలోని శ్రీ విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆత్మధ్యాన సదస్సుతోపాటు టీటీడీ బృందంచే అద్భుతమైన సంగీత గాన కచేరి నిర్వహించనున్నట్లు జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. ధ్యానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వినాయకునికి రూ.2లక్షల విరాళం



రూ.లక్ష విరాళం అందిస్తున్న దాత శ్రీయాన్ కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.2లక్షలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. మధ్యాహ్నం బెంగళూరుకు చెందిన శ్రియన్స్ తిరుపతికి చెందిన నిత్య కుటుంబ సభ్యులు వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి నిత్య అన్నదానానికి లక్ష చొప్పున మొత్తం రూ.2లక్షలు విరాళాలు ఆలయ అధికారులకు అందించారు. భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు



మిట్టపల్లెలో వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పీహెచ్‌ఎన్ భారతి

తవణంపల్లె: పిల్లలకు ఎలాంటి వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకాల పంపిణీ చేపడుతోందని తవణంపల్లె పీహెచ్‌ఎస్ భారతి తెలిపారు. మండలంలోని మిట్టపల్లెలో శనివారం వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. పిల్లలకు పుట్టినప్పటి నుంచి ఎలాంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. అందులకోసమే ఈ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందజేస్తోందని వివరించారు. దీన్ని సద్వినియోగం చేసుకుని, తల్లిదండ్రులు పిల్లందరికీ టీకాలు వేయించాలని కోరారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ క్రమంలో మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని సుమారు 75 మంది పిల్లలకు హెల్త్ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వడగండ్ల వానతో మామిడికి నష్టం



పూతలపట్టులో కురుస్తున్న వర్షం



గుడిపాలలో జోరు వాన



చిత్తూరులో నేలరాలిన మామిడి కాయలు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో శనివారం జోరువాన కురిసింది. అరగంటపాటు కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారాయి. తుమ్మింద, నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లి, తొప్పాతి పరిసర ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురిసింది. దీనికి మామిడి పంట దెబ్బతింది. చెట్లలోని కాయలు చాలా వరకు నేలరాలాయి.

ఉరుములు మెరుపులు

తవణంపల్లె: మండలంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షాల వల్ల మామిడి పంటకు చీడ, పీడలు తొలగిపోయి కాయ ఎదుగుదలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఎగిరిపోయిన ప్లాస్టిక్ రేకులు

గుడిపాల: మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం శనివారం సాయంత్రం కురిసింది. దీంతో అరటిపంట, మామిడి పంట దెబ్బతింది. ఈ వర్షానికి ఉక్కపోత నుంచి కొంత ఉపశమనం కలిగింది. గాలుల తాకిడికి ప్లాస్టిక్ రేకులన్నీ ఎగిరి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో జనం ఇబ్బందులకు గురయ్యారు.

తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



గాంధీ విగ్రహం కూడలి వద్ద స్థల పరిశీలన చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలోని గాంధీ విగ్రహ కూడలి వద్ద తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ అరుణ చెప్పారు. చిత్తూరు లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేయనున్న మినరల్ వాటర్ ప్లాంట్ కోసం గాంధీ విగ్రహ కూడలిలో 1వ పట్టణ పోలీసు స్టేషన్ వద్ద స్థలాన్ని కమిషనర్ అరుణ శనివారం ఉదయం పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు ఈ కూడలికి చేరుకుని, బస్సుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్తారు. వీరి దాహార్తి శాశ్వతంగా తీర్చేలా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు లయన్స్ క్లబ్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలం కోసం కమిషనర్ నగరపాలక ఇంజినీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం కమిషనర్ ఆర్టీసీ బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇదివరకే ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. అంతకుముందు కమిషనర్ నగరంలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ మార్గంలో, ఏఎస్ఎం కాంప్లెక్స్ వద్ద పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రంజాన్ సందర్భంగా సంతపేట మసీదు వద్ద చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సంతపేటలో పలు ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్వో లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, డీఈ రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న వెంకన్న గ్రామోత్సవం

వడమాలపేట: అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని స్వర్ణాభరణాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య శ్రీవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళవాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులు సర్వదర్శనానికి అనుమతించారు. అక్షయ తృతీయ, రెండు రోజుల పాటు సెలవులు రావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. రాత్రి స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు.

27 నుంచి మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని మొరవ గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ సమేత ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో ఈ నెల 27 నుంచి మహాభారత మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ భాగవతారి రత్నకుమారిచే హరికథా కాలక్షేపం, రాత్రి శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన జరుగుందన్నారు. 27న ధ్వజారోహణం, 28, 29 యజ్ఞం, అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, 30న బండికుంభాలు, మే 1న ద్రౌపదీ కల్యాణం, 2న ద్రౌపదీ మానసం రక్షణ, 3న అర్జున తపస్సు, 4న యజ్ఞం, పూజ, 5న ఉత్తరగోగ్రహణం, 6న ఇలావంతుని వధ, 7న దుర్యోధన వధ, ధర్మరాజుల పట్టాభిషేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్





చిత్తూరు: ముస్లింలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బంగారుపాళెం: రంజాన్ ప్రార్థనలకు తరలివచ్చిన ముస్లింలు

చిత్తూరు రూరల్: నగరంలో శనివారం ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ పర్వదినం సందర్భంగా ముస్లింలు మిట్టూరు, రామ్‌నగర్‌కాలనీ, గూల్సింగ్ పేట, ప్రశాంత్‌నగర్, బజారువీధి, సంతపేట, గంగనపల్లె తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ నేపథ్యంలో మతపెద్దలు, ముస్లింలు తొలుత ర్యాలీగా వచ్చారు. తర్వాత అరగంటపాటు ప్రత్యేక ప్రార్థనలను ప్రారంభించారు. తదనంతరం ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారీ రంజాన్ మాస విశిష్టతపై ప్రసంగించారు. ముస్లింలు ఆచరించాల్సిన నియమ నిబంధనలపై వివరించారు. అల్లా మార్గంలో నడిస్తే అంతా మంచే జరుగుతుందని బోధించారు. చివరన ముస్లింలు ఒక్కరినొక్కరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గతంతో పోలిస్తే, ఈ సారి ఈద్గాలో జరిగిన ప్రార్థనలకు ముస్లిం సోదరులు భారీగా తరలిచ్చారు. వీరి రాకతో ప్రార్థన ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ప్రాంగణం బయట వేసిన చలువ పందిరి కూడా ముస్లింలతో నిండిపోయి, రోడ్డు వరకు సందడిగా కనిపించింది. పోలీసు అక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

దీక్షల ఫలితమే

ముస్లింలు చేపట్టిన రంజాన్ దీక్షలు ఫలించి, వర్షాలు కురుస్తున్నాయని, పూర్తిగా వాతావరణం చల్లబడిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఈద్గాలో జరిగిన ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. మతపెద్దలు ఆయన్ను దుశ్శాలువలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసంను ముస్లింలు అత్యంత పవిత్రమైన మాసంగా భావిస్తారన్నారు. ఈ మాసంలో వారు చేసే ఉపవాసదీక్షలకు అల్లా తోడునీడగా నిలవాలని కోరుకుంటున్నానన్నారు. మైనారిటీలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రదర్శనగా..

బంగారుపాళెం: ముస్లింలందర రంజాన్ సందర్భంగా స్థానిక జామియా మసీదు వద్దకు చేరుకున్నారు. మసీదు నుంచి ప్రదర్శనగా మొగిలివెంకటగిరి గ్రామ సమీపంలో గల ప్రత్యేక ప్రార్థనా స్థలం(ఈద్గా) వద్దకు చేరుకున్నారు. అక్కడ రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

తవణంపల్లె: మండలంలోని అరగొండలో కొత్త బస్టాండు దగ్గర ఉన్న దర్గా నుంచి ఈద్గా వరకు ముస్లింలు ర్యాలీగా చేరుకున్నారు. మత గురువు బోధనల అనంతరం భక్తితో ప్రార్థనలు చేశారు. ఈద్గా నుంచి దర్గాకు చేరుకొని పెద్దల సమాధుల వద్దకు వెళ్లి స్మరించుకొన్నారు. అనంతరం పేదలకు దానం చేశారు. మండలంలోని అరగొండ, గాజుల పల్లె, పొన్నేడుపల్లె, ఎగువ తవణంపల్లె, జెట్టిపల్లె, మత్యం తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

అన్న, వస్త్రదానాలు

పూతలపట్టు: మండలంలో ముస్లింసోదరులు ఉదయం మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదకుటుంబాలకు వస్త్రదానం, అన్నదానం చేశారు.

ఈద్గా వద్ద ప్రార్థనలు

ఐరాల: మండల వ్యాప్తంగా ఈద్–ఉల్–ఫితర్(రంజాన్) పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మండల కేంద్రంలోని నూరాని మజీద్ నుంచి తగ్బిర్ చదువుకుంటూ వి.యస్. అగ్రహారం ఈద్గా వద్దకు చేరుకున్నారు. మత పెద్ద జబ్బార్ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు.

ముగిసిన దీక్షలు

యాదమరి: మండలంలోని యాదమరి, 14 కండ్రిగ ముస్లింవాడ, బుడితిరెడ్డి పల్లె ముస్లింవాడ, కమ్మపల్లె, నూరేనగర్, రసూల్ నగర్, వరదరాజుల పల్లె, పెరియంబాడి గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి రంజాన ఉపవాస దీక్షలు ముగించారు. అనంతరం పలుచోట్ల పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఐరాల: ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



తవణంపల్లె: అరగొండ ఈద్గాలో..



చిత్తూరు: ముస్లింల సామూహిక ప్రార్థనలు



పూతలపట్టు: నమాజ్ చేస్తున్న ముస్లింలు